# పెళ్ళయింది

"రెండ్రోజులు సెలవుపెట్టేసెయ్" అని పీక్కుతింటే సెలవు పెట్టేసి వచ్చేడు రామారావు. తీరా వచ్చేక తల్లికి వంట్లో బాగుండలేదని తండ్రీ, కూతురు పెద్దమనిషయ్యిందని మధ్యవర్తీ.. కాళ్లు చాపేసిందీ వాళ్లే. 'పోనీ మీర్రాకపోతే పోయేరు నేనే వెళ్ళొస్తాను' అంటే ముక్కుమీద వేళ్ళతో ఆశ్చర్యపోయేదీ వాళ్ళే.

అందుకే ఒళ్ళు మండుకొచ్చింది రామారావుకి.

ఈ సంవత్సరం ఇప్పటికి పెళ్ళి చూపుల పేరుతో పది రోజులు సీయల్ పోయింది కాక, పాకెట్ మనీ రెండొందర్రూపాయలూ ఖర్చయ్యేయి. పైగా మాటిమాటికీ సెలవు పెడ్తున్నందుకు మేనేజరు చీవాట్లూ, తోటి గుమాస్తాల వేళాకోళాలూ-తల్చుకుంటే మహ చెడ్డమంటగా ఉంది.

"మళ్ళీ చస్తే రాను"అని చెప్పేసేడు.

దాంతో దిగి వచ్చేరు. "సరే, నువ్వే వెళ్ళి చూసిరా.. కానొరో, తిన్నగా కొత్తల్లుడిలా ఇంటికే వెళ్ళిపోకు. ఆయన్ని ఆఫీసులో కల్సుకుని ఆయన్తోపాటు వెళ్ళు. లేపోతే బాగుండదు" అని వందసార్లు చెప్పి, "ఏవిటో వీడుచూస్తే మొండిఘటం. నిజంగా రావడం మానేసినా మానీగల్డు. అటు చూస్తే పెద్ద మనిషితో వ్యవహారం. ఏమనుకుంటాడో, ఏమో..." అంటూ నూటొక్కసార్లు గొణుక్కున్నాడు వాళ్ళ నాన్న.

మధ్యవర్తిని కనుక్కున్నాడు.

పిల్ల తండ్రిపేరు మాధవరావు. మున్సిపలాఫీసు అక్కౌంట్సు సెక్షన్‌లో సీనియరసిస్టెంటు. చాలు ఈ భోగట్టాల్చాలు.

వెంటనే బస్సెక్కేసేడు. గంటలో దిగేసేడు కూడా.

అప్పుడప్పుడు ఆ వూరు వచ్చేవాడు రామారావు కాని మున్సిపల్ ఆఫీసెక్కడో తెలీదు. అయితే అదో పెద్ద కష్టంకాదు. ఏ రిక్షావాణ్ణో, లేదూ, పెద్దమనిషినో, చిన్న మనిషినో, చివరికి కుళాయి దగ్గరున్న ఏ మనిషినడిగినా చాలు. ఆరోడ్లనీ, ఆ కాలవలనీ, ఈ కుళాయిల్నీ, మరుగుదొడ్లనీ, చెత్తనీ చెదారాన్నీ తల్చుకుని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టి మరీ చూపిస్తారు.

మరింక గోతికాడ నక్కల్లా కాచుక్కూర్చున్న ఆఫీసు కుక్కల్ని దేన్నడిగినా కారుకూతలు కూసి మాధవరావు సీటు చూపిస్తుంది.

అదిగో అలా వెళ్లేడు.

అక్కడ. ఆ సీట్లో ఎండునక్కలా సన్నగానూ, పండుటాకులా ముసలిగానూ ఉన్నప్పటికీ కంచు గంటలా టంగు టంగున వాగుతున్నాడు మాధవరావు టేబిలు కెదురుగా ఉన్నవాడితో.

"ఏంటండీ? అందరికీ మేరేజి అడ్వాన్సులే. పిల్లా పీచూ లేరుకదా మరింక ఏ ఆడకూతురికి పెళ్ళి చేసేస్తారండీ?" అడుగుతున్నాడు కాస్త అధికారంతోనూ, కొంచెం వెటకారంగానూ.

అవతలి వాడి కో నలభైయ్యేళ్లుంటాయి. అయినా వంగిపోయున్నాడు కనిపించని బరువుతో.

"లేదండీ. అత్యవసరం పడింది. చాలా చికాకుల్లో ఉన్నాను. అందరిలాగే పర్సెంటేజీ. ఆ పైన మీదయ" అంటూ నాన్చేస్తున్నాడు.

ఈలోగా రామారావు రావడం చూసి "వూ. సర్సర్లే. రేపో మాపో కనిపించండి. వెళ్ళండి" అని పంపించేశాడు.

'మాధవరావు గారు?' ఎవరన్నట్టుగా నెమ్మదిగా అడిగాడు రామారావు హాల్లోకి ప్రవేశించి.

"ఉ...నేనే.... ఏమిటి?" గొంతు ఏమాత్రం తగ్గించకుండా ఠంగుఠంగున గంటలు కొట్టినట్లు అడిగాడు.

"మరేం లేదూ" అంటూ మధ్యవర్తిపేరు చెప్పి, ఆయన పంపించినట్లుగా చెప్పాడు.

"ఉత్తి చేతులతోనా? అతగాడికి గుర్తులేకపోతే మీ బుద్ధేమయ్యింది, వూ॰" డబాయించాడు.

"అది కాదండీ..." అని అసలు కారణం చెప్పబోయాడు రామారావు.

"ఏది కాదు. మొన్న అడిగాడు వచ్చి. మీ ఇంటి టాక్సును గురించి కమీషనరు గారితో రేటు ఫిక్సు చేయించుకు వెళ్ళాడు. ఇంటికి వచ్చి ఇస్తానన్నాడు. సరే రాలేదు. ఇప్పుడు మిమ్మల్ని పంపాడుకదా. మీ చేతైనా పంపద్దూ. మీలాంటి వాళ్ళకి నేను పనులు చేసిపెట్టాలా? ఏదో మా అమ్మాయికో గంతకు తగ్గ బొంతని చూసి పెట్టానూ అంటే ఆశపడి అతగాడికీ, అతగాడి పేరుమీద వచ్చిన మీకూ మర్యాదిస్తున్నాను కానీ" లేకపోతే గెంటించేస్తానన్నంత ధాటిగా దడదడ మాట్లాడాడు మాధవరావు.

గతుక్కుమన్నాడు రామారావు.

"సరే. వస్తానండీ. మీచేత గెంటించుకోవడం దేనిక్కానీ.. నేను మీరనుకుంటున్నవాణ్ణి కాదు. గంతకు తగ్గ బొంతని. మిమ్మల్ని చూశాను. మరింక మీ అమ్మాయిని చూడనవసరంలేదు. వస్తాను" గుక్క తిప్పుకోకుండా గడగడ చెప్పేసి గిరుక్కున వెనక్కి తిరిగాడు రామారావు.

*(ఆంధ్రసచిత్ర వారపత్రిక, 31-8-1983)*